APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

03-05-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 188
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



4



ఉద్యోగ సంఘాల నేతలతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఉద్యోగ సంఘాలకు సీఎం స్పష్టత ఇచ్చారు. 100 రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిల చెల్లింపుల కోసం రూ.6వేల కోట్లు ఇస్తామని చెప్పారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు ఇవ్వాలని అధికారుల కమిటీని ఆదేశించామని, ఆ రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులకు జూన్ 1లోగా ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. రెండు నెలలకోసారి ఉద్యోగుల సమస్యలపై గుర్తింపు సంఘాలు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తమదేనని సీఎం తెలిపారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే
# బాధ్యత మాదే
### ఉద్యోగుల పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేస్తాం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాబోయే 100 రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర పెండింగ్ బకాయిల కోసం రూ.6వేల కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో నిర్వహించిన కీలక భేటీలో సీఎం మాట్లాడారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని, ఫ్రెండ్లీ విధానంతో సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత తమదేనని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పనిచేశారని, వారి సహకారంతోనే సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని, ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు అందేలా చర్యలు చేపట్టామని వివరించారు.

**పీఆర్సీపై స్పష్టత**

కొత్త పీఆర్సీపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పీఆర్సీ అమలుపై త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల చిరకాల కోరికైన మెరుగైన వైద్యంపై స్పందిస్తూ జూన్ 1 లోగా ఉద్యోగులందరికీ కొత్త ఆరోగ్య భద్రత కార్డులను పంపిణీ చేస్తామని తెలిపారు. దీనివల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవల విషయంలో భరోసా లభిస్తుందన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డుల ప్రతిపాదనపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, దీనిపై మానవీయ దృక్పథంతో ఆలోచించి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి వచ్చేలా ప్రతి రెండు నెలలకోసారి గుర్తింపు పొందిన సంఘాలు సమగ్ర నివేదికను అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, పాలనలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామని, ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం నిర్వహించామని చెప్పారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామని వివరించారు. ఈ రెండేళ్లలో ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గుర్తు చేశారు.

**ప్రణాళికాబద్ధంగా చెల్లింపులు**

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాలుగా మిగతా 2లో...



2

## 4న మంత్రి మండలి భేటీ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక నిర్ణయాలు
- అజెండాలో సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగుల సమస్యలు
- పెన్షన్లు, ఇందిరమ్మ బీమాపై చర్చించే అవకాశం



## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు

- రెండున్నరేళ్లలో మోసాలు, కుంభకోణాలు
- కాంగ్రెస్ దుర్మార్గ పాలనతో ప్రజలు విసిగిపోయారు
- మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్ల కోసమే చూస్తున్నారు
- భూములు, మైనింగ్ కుంభకోణాల్లో మంత్రులకు భాగస్వామ్యం
- గ్యాస్ సిలిండర్ ధరను రూ.వెయ్యి పెంచిన బీజేపీ తీరు ప్రజా వ్యతిరేకం
- పెంచిన గ్యాస్ ధరను వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల పాలన చూసిన తర్వాత ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీకి ఓటు వేసే అవకాశం లేదని, తిరిగి తెలంగాణలో కాంగ్రెస్ కనీసం 20 సంవత్సరాల పాటు అధికారంలోకి రావడం కల్లని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నంది నగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. మిగతా 2లో...

## మళ్లీ రగిలిన
# యుద్ధం..!?

- గల్ఫ్‌లోని 16 అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు
- ఇరాన్ దెబ్బకు కువైట్‌లోని అమెరికా క్యాంప్ బ్యూరింగ్ ఖాళీ
- అమెరికా ఆంక్షలతో చమురు ఆదాయం కోల్పోయిన టెహ్రాన్
- అమెరికా షరతులకు లొంగబోమని ఇరాన్ సంకేతాలు
- మధ్యవర్తి పాకిస్థాన్‌కు ముసాయిదా ప్రతిపాదనలు అందజేత
- టెహ్రాన్ కొత్త ప్రతిపాదనపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి
- బలహీనంగా ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం
- అమెరికా ఏ నిబంధనలకు కట్టుబడి ఉండదంటూ హెచ్చరిక
- ఏ క్షణమైనా యుద్ధం మళ్లీ ప్రారంభం కావచ్చంటూ ఇరాన్ వెల్లడి



2



2

## చెరువులకు 'రైతు కమిటీలు'

- జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్ ఆదేశం
- నిర్దిష్ట కాలపరిమితిలో పునరుద్ధరణ పనులు

## కింగ్ మేకర్‌గా విజయ్?

తమిళ రాజకీయాల్లో ఉత్కంఠ

- దశాబ్దాల ద్విముఖ పోరుకు చెక్
- త్రిముఖ సమరంగా ఎన్నికల ఫలితాలు
- తమిళనాడులో తొలిసారి 'హంగ్' ముప్పు?
- టీవీకే వైపు చూస్తున్న ప్రధాన పార్టీలు

2




## బీమా రంగంలో 100% విదేశీ పెట్టుబడులు

- కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- ఆటోమేటిక్ రూట్ ద్వారా పూర్తి స్థాయి పెట్టుబడులకు అనుమతి
- ఎల్ఐసీకి పాత నిబంధనలే.. 20 శాతానికే పరిమితం

2

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే బాధ్యత మాదే

(మొదటి పేజీ తరువాయి)
పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను చాలా వరకు పరిష్కరించామని తెలిపారు. మొదటి తారీఖునే ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని, రాష్ట్ర ఆవిర్భావం నాటికి ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ఏమీ లేవని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల బిల్లులు పేరుకుపోయాయని, దీనిపై ఒక కసరత్తు చేసి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. 100 రోజుల్లో దాదాపు 6 వేల కోట్లు పెన్షనర్ బకాయిలు క్లియర్ చేయాలని ప్రయత్నిస్తున్నామని, ఇది ప్రభుత్వానికి ఉద్యోగులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవీయ దృక్పథంతో ఆలోచించారని, సమస్యల పరిష్కారం కోసం సీఎం ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో గతంలో చాలా వరకు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో 13,100 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఉద్యోగ సంఘాల నాయకులు కొనియాడారు. పీఆర్సీ, హెల్త్ కార్డుల సమస్యలతో పాటు ఉద్యోగ సంఘాల ఇతర డిమాండ్లను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.



**ఆందోళనల విరమణ**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు మరియు సమస్యలపై చూపిన స్పష్టతపై ఉద్యోగ సంఘాలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 5 న నిర్వహించాలనుకున్న నిరసన కార్యక్రమంతో పాటు అన్ని రకాల నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకుంటున్నట్లు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్, టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి. ప్రభుత్వంతో సహకరించుకుంటూ రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములవుతామని ఉద్యోగ నేతలు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రధానంగా 100 రోజుల్లో రూ. 6 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు, పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం, జూన్ 1 నాటికి ఆరోగ్య భద్రత కార్డుల పంపిణీ, ప్రతి రెండు నెలలకోసారి సమస్యలపై నివేదిక వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు వచ్చాయి. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట లభించనుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఫ్రెండ్లీ పోలీసీపై ఉద్యోగ వర్గాల్లో సానుకూల చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు మరియు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మిగిలిన పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం ఇదే తరహాలో పరిష్కరిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరడంలో ఉద్యోగుల కృషి మరువలేనిదని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పదే పదే నొక్కి చెప్పారు.

# కింగ్ మేకర్‌గా విజయ్?



**నేషనల్ డెస్క్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తమిళనాడు రాజకీయ చరిత్రలో గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా ఈసారి సరికొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఎప్పుడూ ఏదో ఒక కూటమికి స్పష్టమైన మెజారిటీ ఇచ్చే తమిళ ఓటర్లు, ఈసారి విభిన్నమైన తీర్పు ఇస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) రాజకీయ రంగప్రవేశంతో రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతున్న డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్య పోరు కాస్తా.. ఇప్పుడు త్రిముఖ సమరంగా మారింది. ఈ క్రమంలోనే 'హంగ్ అసెంబ్లీ' అనే పదం ఇప్పుడు తమిళనాట చర్చనీయాంశమైంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 40 నుంచి 60 స్థానాల వరకు గెలుచుకునే అవకాశం ఉందని విశ్లేషణలు చెపుతున్నాయి. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 సీట్లు అవసరం. ఒకవేళ ఏ కూటమికి కూడా మ్యాజిక్ ఫిగర్ అందకపోతే, విజయ్ మద్దతు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యంగా మారుతుంది. గతంలో కేవలం రెండు పార్టీల మధ్యే అధికారం పంచుకోబడగా, ఈసారి మూడో శక్తిగా విజయ్ తెరపైకి రావడం ఒక పెద్ద మార్పుగా భావిస్తున్నారు. ప్రస్తుత అధికార పార్టీ డీఎంకే.. కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన పటిష్టమైన కూటమితో బరిలో ఉన్నప్పటికీ, విజయ్ తన ప్రచారంలో డీఎంకేనే ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. ఒకవేళ మెజారిటీకి కొద్దిపాటి సీట్ల దూరంలో డీఎంకే నిలిచిపోతే, విజయ్‌ను ప్రసన్నం చేసుకోవడం ఆ పార్టీకి సవాల్‌తో కూడుకున్న పనే. కేవలం రాజకీయ మద్దతుతో సరిపెట్టకుండా, అధికారంలో వాటా వంటి అంశాలపై పట్టుబట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, డీఎంకేను అధికారం నుంచి దించడమే లక్ష్యంగా పెట్టుకున్న అన్నాడీఎంకే.. అవసరమైతే విజయ్‌తో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉందనే చర్చ సాగుతోంది. అయితే ఇక్కడ ప్రధాన చిక్కుముడి ముఖ్యమంత్రి పదవిపైనే ఉండేలా కనిపిస్తోంది. సీనియర్ నాయకుడైన ఎడప్పాడి పళనిస్వామి తన పదవిని వదులుకుని విజయ్‌కు అవకాశం ఇస్తారా? లేదా రాజకీయ ప్రయాణం ప్రారంభంలో ఉన్న విజయ్.. కింగ్ మేకర్ పాత్రకే పరిమితమవుతారా? అన్నది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, ఈసారి తమిళనాడు ఫలితాలు రాష్ట్ర రాజకీయ దిశను మార్చబోతున్నాయనడంలో సందేహం లేదు.

# 4న మంత్రిమండలి భేటీ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 4వ తేదీ సోమవారం రాష్ట్ర మంత్రిమండలి సమావేశం కానుంది. రాష్ట్ర అభివృద్ధి, పాలనాపరమైన కీలక అంశాలతో పాటు ఎన్నికల హామీల అమలుపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తు, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు, సంక్షేమ పథకాల విస్తరణ వంటి అంశాలు కేబినెట్ అజెండాలో ఉన్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణపై కేబినెట్ కీలక చర్చ జరపనుంది. ప్రాజెక్టులోని సాంకేతిక లోపాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులపై మంత్రులతో సీఎం సమీక్షించనున్నారు. అలాగే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం, ఈ దిశగా మహారాష్ట్ర ముఖ్యమంత్రితో జరగనున్న భేటీ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఇటీవల ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన భేటీ నేపథ్యంలో, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను 100 రోజుల్లో చెల్లించే కార్యాచరణకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియపై అధ్యయన కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రుల మండలి పరిశీలించనుంది. పీఆర్సీ నివేదికపై తీసుకున్న నిర్ణయాలను కూడా చర్చించే అవకాశం ఉంది. కొత్త ఆసరా పెన్షన్ల మంజూరుతో పాటు ఇందిరమ్మ బీమా పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల మేరకు కేకే, కోదండరాం కమిటీ విధివిధానాలను ఖరారు చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, తదుపరి చర్యలపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర పాలనలో ఈ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది.

# చెరువులకు 'రైతు కమిటీలు'

**జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్ ఆదేశం**



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువుల పరిరక్షణ మరియు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతి చెరువుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెరువుల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో స్థానిక రైతులు, అధికారులు, ఇతర స్టేక్ హోల్డర్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చెరువుల పరిస్థితి, అభివృద్ధిపై రైతు కమిషన్ సమర్పించిన నివేదికను మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. కమిషన్ చేసిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి అమలుకు తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణ పనులు నిర్దిష్ట కాలపరిమితితో పూర్తి కావాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. కబ్జాలకు గురికాకుండా చూడటంతో పాటు, సాగునీటి అవసరాలకు అనుగుణంగా చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి వనరులను పటిష్టం చేసేందుకు ఈ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మళ్లీ రగిలిన యుద్ధం..!?

**నేషనల్ డెస్క్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పశ్చిమాసియాలో ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదని, అమెరికాతో మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశం ఉందని ఇరాన్ కు చెందిన సీనియర్ సైనికాధికారి సర్దార్ అసదీ శనివారం వెల్లడించారు. ఇరాన్ తాజాగా పంపిన చర్చల ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కొన్ని గంటలకే ఇరాన్ సైనికాధికారి నుంచి ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. ఇరాన్ తన ముసాయిదా ప్రతిపాదనలను గురువారం సాయంత్రం మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్‌కు అందజేసినప్పటికీ, అందులోని అంశాలను ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించలేదు.

**బలహీనంగా కాల్పుల విరమణ**
అమెరికాతో ఇరాన్ చేస్తున్న యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని ఖాంట్టం అల్అన్బియా సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్దార్ అసదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ అది అత్యంత బలహీనంగా ఉందని ఆయన విశ్లేషించారు. అమెరికా ఎలాంటి ఒప్పందాలకు లేదా నిబంధనలకు కట్టుబడి ఉండదని, వారి ప్రకటనలు కేవలం మీడియా ప్రచారం కోసమేనని అసదీ విమర్శించారు. చమురు ధరలు పడిపోకుండా చూసుకోవడం సహా తమకు తాము సృష్టించుకున్న గందరగోళం నుంచి బయటపడడమే అమెరికా ప్రధాన లక్ష్యమని ధ్వజమెత్తారు. అమెరికన్ల నుంచి ఎదురయ్యే ఎలాంటి దాడులనైనా ఎదుర్కొనేందుకు తమ సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

**అమెరికా సైనిక స్థావరాలకు భారీ నష్టం**
గల్ఫ్ ప్రాంతంలోని వివిధ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలకు ఇరాన్ ఊహించని స్థాయిలో నష్టం కలిగించిందని సీఎన్ఎన్ పరిశోధనాత్మక నివేదిక వెల్లడించింది. కువైట్‌లోని క్యాంప్ బ్యూరింగ్ ఒకప్పుడు అమెరికాకు చెందిన అతిపెద్ద సైనిక కేంద్రంగా ఉండేదని, అయితే అది నేడు ఇరాన్ క్షిపణులు మరియు డ్రోన్ల దాడితో పూర్తిగా ఖాళీ అయిపోయిందని పేర్కొంది. అమెరికా మరియు ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ రక్షణ వ్యవస్థలపై దాడులు చేస్తున్నప్పటికీ, ఇరాన్ ఎనిమిది దేశాల్లోని కనీసం 16 అమెరికా సైనిక స్థావరాలను ధ్వంసం చేసిందని నివేదిక వివరించింది. గల్ఫ్ ప్రాంతంలోని మెజారిటీ అమెరికా సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని, వాటిలో కొన్ని పూర్తిగా ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయని సీఎన్ఎన్ తెలిపింది.

**ఆర్థికంగా ఇరాన్ కు గండి**
మరోవైపు ఒమన్ గల్ఫ్ పరిసర సముద్ర మార్గాల్లో అమెరికా విధిస్తున్న ఆంక్షల వల్ల ఇరాన్ దాదాపు 4.8 బిలియన్ డాలర్ల మేర చమురు ఆదాయాన్ని కోల్పోయినట్లు యాక్సియోస్ వార్తా సంస్థ పేర్కొంది. పెంటగాన్ అంచనాల ప్రకారం అమెరికా అమలు చేస్తున్న ఆపరేషన్ల వల్ల టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా చమురు వాణిజ్యంపై ఆంక్షలు విధించడంతో ఇరాన్ కు దక్కాల్సిన సుమారు 5 బిలియన్ డాలర్ల ఆదాయం నిలిచిపోయిందని రక్షణ శాఖ అంచనా వేస్తోంది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ టోల్ వసూలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, టోల్ చెల్లించే షిప్పింగ్ సంస్థలపై ఆంక్షలు విధిస్తామని యూఎస్ ట్రెజరీ శాఖ హెచ్చరించింది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన ఈ యుద్ధం ఏప్రిల్ 8 నుంచి తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ, శాంతి ఒప్పందం ఇంకా కుదరకపోవడంతో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.



# బీమా రంగంలో 100% విదేశీ పెట్టుబడులు




**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశీయ బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి కేంద్ర ప్రభుత్వం ద్వారాలు పూర్తిగా తెరిచింది. బీమా కంపెనీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని ప్రస్తుతమున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ శనివారం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇకపై విదేశీ ఇన్వెస్టర్లు ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరం లేకుండానే (ఆటోమేటిక్ రూట్) భారతీయ బీమా సంస్థల్లో పూర్తి స్థాయి వాటాలను దక్కించుకోవచ్చు. బీమా రంగం మొత్తానికి 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతించినప్పటికీ, ప్రభుత్వ రంగ సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) విషయంలో మాత్రం కేంద్రం పాత నిబంధనలనే కొనసాగించింది. ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల పరిమితిని యథాతథంగా 20 శాతానికే పరిమితం చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎల్ఐసీ ప్రత్యేక చట్టం కింద పనిచేస్తుండటమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు వెల్లడించారు. విదేశీ పెట్టుబడులు 100 శాతం ఉన్నప్పటికీ, ఆ కంపెనీల నియంత్రణలో కొన్ని కీలక నిబంధనలను కేంద్రం విధించింది. కంపెనీ బోర్డు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లేదా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లలో కనీసం ఒకరు భారతీయ పౌరుడై ఉండాలి. నిధులను విదేశాలకు తరలించే విషయంలో మరియు రిజర్వు నిధుల నిర్వహణలో ఐఆర్‌డీఏఐ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్లోబల్ ఇన్సూరెన్స్ దిగ్గజాలు నేరుగా భారత మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల బీమా రంగంలో పోటీ పెరిగి, సామాన్యులకు తక్కువ ప్రీమియంతో మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు బీమా సేవలను విస్తరించడానికి మరియు ఈ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది.

# కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు

(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి సబ్బండ వర్గాలను మోసం చేసిందని, ఆ పార్టీ చేస్తున్న అవినీతి అరాచకాలు, కుంభకోణాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి అడ్డగోలుగా పెరిగిపోయిందని, అన్ని అంశాల్లోనూ ఆ పార్టీ నేతలు కమిషన్లు, కాసుల కక్కుర్తి కోసమే చూస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూములతో పాటు అనేక మైనింగ్ కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ మంత్రులే స్వయంగా పాల్పడుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ అరాచకాలు చూసిన తర్వాత ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, కేవలం అక్రమ సంపాదనపైనే అధికార పార్టీ నేతలు దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచకాలు సాగుతుంటే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిన్న ఒకేసారి వెయ్యి రూపాయలకు పైగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధర బీజేపీ ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. అడ్డగోలుగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ వస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల ప్రజలపై నిత్యావసర సరుకుల భారం విపరీతంగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ తీసుకుంటున్న ఈ అడ్డగోలు నిర్ణయాలపై ఎక్కడి నాయకులు అక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన సిలిండర్ ధరను వెనక్కి తీసుకొని ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, కమిటీల నిర్మాణంలో పార్టీ నేతలు చురుగ్గా పాల్గొనాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించి కాంగ్రెస్, బీజేపీలు చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించేలా చూడాలని, కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. అధికార పార్టీలు అడ్డగోలుగా ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ప్రజల ఓటు హక్కుకు భరోసాగా నిలవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.





## నీట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన

# జిల్లా కలెక్టర్,ఎస్పీ

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తగడి ప్రాంతంలో గల టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికల)లో ఏర్పాటు చేసిన నీట్ (నీట్ ) పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సంయుక్తంగా సందర్శించారు.ఈ సందర్భంగా వారు పరీక్షల నిర్వహణ తీరును, అభ్యర్థులకు కల్పించిన కనీస వసతులను మరియు భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144 అమలులో ఉందని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.




## పని ప్రదేశాలలో మహిళలను వేధించరాదు

- షీటీం ఎస్ఐ పూలబాయి
- నారాయణఖేడ్లో కూలీలకు షీటీం అవగాహన

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పని ప్రదేశాలలో మహిళా కూలీలపై వేధింపులు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం ఎస్ఐ పూలబాయి హెచ్చరించారు. నారాయణఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌరస్తా వద్ద లేబర్ అడ్డాలో కూలీలకు షీటీం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో షీటీం సభ్యులు తులసిరామ్, చాంగు బాయి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



## హజ్ యాత్రకు వెళ్తున్న

# సీనియర్ జర్నలిస్ట్‌కు సన్మానం

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ సత్తార్ ఈ నెల 5వ తేదీన హజ్ యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా, ఆయనకు తోటి జర్నలిస్ట్ మిత్రులు శనివారం పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో పూలమాల శాలువలతో ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన యాత్ర విజయవంతంగా పూర్తవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మానిక్ ప్రభు, అమృత్,కౌసర్,వెంకటేశం,హసీబ్ పటేల్, విఠ్ఠల్,మధుసూదన్,గోవర్ధన్,ఆసిఫ్, మజర్, వాజీద్,సయీద్,ప్రతాప్,చోటు, రాములు, ఇబ్రహీం,రషీద్, లతీఫ్, ఖైసర్ పాల్గొన్నారు.అలాగే స్థానికులు బాబు ఖాన్, రజాక్,రషీద్,బాబా,ఖదీర్ తదితరులు హాజరయ్యారు.




# విద్యుత్ షాక్‌తో గేదె మృతి

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

విద్యుత్ షాక్ సర్క్యూట్తో ఓ రైతు గేదె మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలం గొల్ల కుంట గిరిజన తండాలో శుక్రవారం రాత్రి జరిగింది. తండాకు చెందిన విస్లావత్ శోభి బాయ్ తాండాకు సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రిక తీగలకు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందింది. దీని విలువ సుమారు 70 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.గేదె మృతి చెందినందున తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు.

## 9 గంటల్లోనే చోరీ కేసు ఛేదన..

# రెండు తులాల బంగారం రికవరీ

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

- ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ చాకచక్యం బాధితురాలికి 9 గంటల్లోనే సత్వర న్యాయం
- బండమీది పల్లి గ్రామంలో తాళం వేసిన ఇంటిలో చొరబడి చోరీ
- ఇంటి తాళం విరగొట్టి రెండు తులాల బంగారంను దొంగిలించిన దొంగ
- పెద్దేముల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితురాలు నస్రీన్ బేగం
- 9 గంటల్లో నిందితుడు అరెస్ట్.. రెండు తులాల బంగారం రికవరీ
- చోరీ జరిగిన 9 గంటల్లో నిందితుడిని పట్టించిన గ్రామంలోని సీసీ కెమెరాలు
- గ్రామంలో చోరీ కలకలం..9 గంటల్లోనే చోరీ కేసును ఛేధించిన పోలీసులు
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్, ఇతర పోలీసు సిబ్బందిని ప్రశంసించిన బండమీదిపల్లి గ్రామ ప్రజలు
- నిందితుడు మహమ్మద్ ఖాజా పై చట్ట పరమైన చర్యలు
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్



పెద్దేముల్ మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామంలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు.ఫిర్యాదు అందిన కేవలం 9 గంటల వ్యవధిలోనే దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని బాధితురాలికి న్యాయం చేయడం విశేషం.ఈ కేసుకు సంబంధించి పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన నస్రీన్ బేగం మే 1వ తేదీ శుక్రవారం నాడు రాత్రి తన ఇంట్లోని బీరువాలో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను భద్రపరచి ఉంచింది.మే 2న శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు ఇంటికి తాళం వేసి వెళ్ళింది.తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం తెరిచి ఉండడం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పాటు అందులోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు అందుకున్న పెద్దేముల్ పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ అనుమానాస్పద కదలికలను గుర్తించారు.ఈ క్రమంలో గ్రామంలో తిరుగుతున్న మహమ్మద్ ఖాజా పాషాను అదుపులోకి తీసుకుని విచారించగా,అతడే చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన రెండు తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు .ఈ ఘటనలో పోలీసులు చూపిన వేగవంతమైన స్పందన, సీసీ కెమెరాల వినియోగం పట్ల గ్రామ ప్రజలు పోలీసులపై ప్రశంసలు కురిపించారు.



## కోరకల్లు గ్రామంలో, బొడ్రాయి

# పండగ నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

**వాజేడు,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

01/05/2026 శుక్రవారం రోజున మొదటి రోజు భాగంగా,కోరకల్లు గ్రామానికి శ్రీలక్ష్మి,భూలక్ష్మి, శ్రీ భువనేశ్వర స్వామి సమేత, మరియు ఎర్రమ్మ పోచమ్మ, మైసమ్మ, నాగులమ్మ,గ్రామ దేవతలకు గ్రామ తోరణం పురోహితులు చేపట్టారు.అలాగే బొడ్రాయి పండుగ రెండోరోజు భాగంలో శనివారం రోజున, కోరకల్లు గ్రామంలో యాగశాల నందు గ్రామ పుణ్య దంపతులచే బ్రహ్మశ్రీ కిస్టోజు రవీంద్ర చార్యులు మరియు పురోహితులు హోమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అలాగే ఆదివారం రోజున శ్రీ శ్రీలక్ష్మి భూలక్ష్మి శ్రీ భువనేశ్వర స్వామి బొడ్రాయి స్థాపన కార్యక్రమం చేపట్టనున్నారు.ఈ కార్యక్రమంలో,గ్రామ పెద్దలు మరియు గ్రామ ఆడపడుచులు అందరూ పాల్గొన్నారు.





## వడదెబ్బతో గిరిజన రైతు మృతి

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని కోమటికుంట గిరిజన తండా కు చెందిన బి.బాన్య నాయక్ (55) వడదెబ్బతో శనివారం మృతి చెందారు.తన కున్న మేకలను గిరిజన తండా పరిసరాల్లో మేపుతూ ఉండగా నేలపై సమీపంలోని గిరిజనులు జోగిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాన్య నాయక్ మృతి చెందినట్లు,కుటుంబీకులు తెలిపారు. ఎండ వేడిమి తట్టుకోలేక పడిపోవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లిన మరణం తప్ప లేదన్నారు.ఈ నిరుపేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన వాసులు కోరుచున్నారు.




# ప్రజా పాలనతో వేగవంతమైన అభివృద్ధి

## అధికారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి దిశానిర్దేశం

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. స్థానిక సాయి బాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రగతి ప్రణాళికలు సిద్ధం చేయాలని, అభివృద్ధి పనులను జాప్యం లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.సమావేశంలో ప్రజా పాలన దరఖాస్తుల పురోగతిపై చర్చించడంతో పాటు, పెండింగ్ పనులు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. రాబోయే కాలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు,మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## శ్రీశైలమల్లికార్జున శతకము

**సీసము**

అఖిలేశ కరుణించి యవని జేరగ రావ
కలియుగమును నీవె కావ గలవు
పాపమ్ములను పెంచి తాపంబు కలిగించు
దుష్ట నరులనంత తుంచ రమ్ము
హత్యలన్ జేసెడి ఆసురీ శక్తుల
రక్త దాహము నుంచి ముక్తి నొసగు
మోసమ్ము జేసెడి ముష్కరులను వంచి
సజ్జనులను గావ సాగి రమ్ము

**తేటగీతి**

మమతలే కరువైన యీ మహిని నీవె
సమత పంచి రక్షించాలి సంగమేశ!
శరణు శరణయ్య !కాపాడు శంకరయ్య !
ధరణి శ్రీశైల మల్లయ్య ! దండమయ్య !

-బండి మల్లికార్జున్
వికారాబాద్
9701324734

# GENERAL



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com